క్లుప్తంగా

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



విరాళం చెక్కులను అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం పర్వదినం కావడంతో గురవాయిగూడెం శ్రీఅయ్యప్పస్వామి వారి క్షేత్రంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి భస్మాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. క్షేత్రంలో నిర్మించిన 18 మెట్లలో ఒక మెట్టుకి గురవాయిగూడెంకు చెందిన దల్లి కేదారేశ్వర రెడ్డి దంపతులు రూ.2 లక్షలు, మరో మెట్టుకి మద్రాస్‌కి చెందిన యేదూరి వేణురెడ్డి రూ.2లక్షల విరాళం చెక్కులను కమిటీ సభ్యులకు అందజేశారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ తమ్మన వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్ల ప్రారంభం



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలోని చెత్త సేకరణ నిమిత్తం దాతలు బహూకరించిన ట్రాక్టర్లను సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి నేతృత్వంలో పాలకవర్గ సభ్యులు మూడు ట్రాక్టర్లకు పూజలు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పలువురు పెద్దలు ట్రాక్టర్లు, ట్రక్కులు, అదేవిధంగా వాటర్ ట్యాంకర్లను బహుకరించారని, వీటి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలకు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: బోడిగూడెం పంచాయతీ పరిధిలోని అంకాలగూడెం గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. దళితవాడలోని మూడు చోట్ల రూ.10.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ గంజిమాల రామారావు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.22.50 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ కడకట్ల గడ్డియ్య తెలిపారు. గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి సమస్యలను తీసుకువెళ్లడంలోనూ, నిధులను కేటాయింప చేయడంలోనూ ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్ చొరవ చూపారని ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, గంట రాంబాబు, యేలేటి చంద్రం, చల్లా సుబ్బారావు, జొన్నకూటి రమేష్, చిడిపి రవి, దూలపల్లి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల ధర్నా

చింతలపూడి: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, అధికారులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత పోరాట కమిటీల ఆధ్వర్యంలో సోమవారం రైతులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, చిట్లూరి అంజిబాబు, కె శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్‌వీ ఎస్ నారాయణ, సత్యన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉత్సవాలు



ఆంజనేయస్వామి నూతన ఆలయం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ మంగపతి దేవిపాలెం మారుతి జంక్షన్(మూడు పుంతల రోడ్డు) వద్ద నూతనంగా నిర్మించిన శ్రీదాసాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9:45 నిమిషాలకు ఆలయ ప్రారంభోత్సవం చేస్తారు. 29వ తేదీ ఉదయం 11.26 గంటలకు నూతన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, అదేరోజు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు వాడపల్లి రాంబాబు, లక్ష్మణ బ్రదర్స్ తెలిపారు. తమ తండ్రి వాడపల్లి నారాయణరావు జ్ఞాపకార్థం పూర్వపు ఆలయ స్థానే నూతనంగా ఆలయం నిర్మించామని, తాము అందజేసిన రూ.పది లక్షల విరాళంతో పాటు గ్రామస్తులు, దాతల నుంచి సేకరించిన మరో రూ.25 లక్షలతో స్వామివారి ఆలయ నిర్మాణం రూపు దాల్చిందన్నారు.



దొరమామిడిలో రైతు భరోసా కేంద్రం



తెల్లంవారిగూడెంలో సీసీరోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి (ఫైల్)

ఏజెన్సీలో ప్రగతికి బాటలు



దొరమామిడిలో సచివాలయ భవనం

- మునుపెన్నడూ చూడని సంక్షేమ పాలన
- కోట్ల రూపాయలతో గ్రామాల అభివృద్ధి
- వైఎస్సార్ సీపీ పాలనలో మారిన దొరమామిడి రూపురేఖలు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ పాలనలో ఏజెన్సీలో గ్రామాల రూపురేఖలు మారాయి. గత టీడీపీ పాలనలో ఏజెన్సీలోని గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఆయా గ్రామస్తులు నానా పాట్లు పడేవారు. అలాగే గ్రామ పంచాయతీకి ఏడాదికి కేవలం 135 పింఛన్లు, గ్రామ అభివృద్ధికి పంచాయతీ నిధులు సుమారు రూ.5 లక్షల మాత్రమే కేటాయించేవారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థతో పల్లె ప్రగతికి బాటలు వేశారు. ఒక పక్క సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, మరో పక్క అభివృద్ధిపై ఆయన దృష్టి పెట్టారు. ఏజెన్సీ ప్రాంతంలోని 5 గిరిజన మండలాలు ఉండగా 107 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అయితే వాటిలో ఒక్క సచివాలయాన్ని పరిశీలిస్తే సంక్షేమ పథకాల తీరు, అభివృద్ధి అర్థమవుతుంది.



దుద్దుకూరులో నిర్మించిన డ్రెయినేజీ



దొరమామిడిలో బస్‌షెల్టర్

దొరమామిడిలో రూ.20 కోట్లతో సంక్షేమం

బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం గ్రామ సచివాలయం పరిధిలో 14 గిరిజన గ్రామాలు ఉన్నాయి. సుమారు 5,718 మంది జనాభా ఉన్న దొరమామిడి పంచాయతీలో గత ప్రభుత్వం పాలనలో 250 మందికి పింఛన్లు, సుమారు రూ.3 లక్షలు అభివృద్ధి పనులు కేటాయించే వారని, అంతకుమించి చేసింది ఏమీలేదని టీడీపీ పాలనలో పనిచేసిన సర్పంచ్‌లు చెపుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి దొరమామిడి గ్రామ సచివాలయాల పరిధిలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీసింది. గ్రామ సచివాయ వ్యవస్థ ద్వారా 9 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందాయి. దొరమామిడి పంచాయతీ పరిధిలో దొరమామిడి, తెల్లంవారిగూడెం రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకూ రూ.20 కోట్ల 79 లక్షల 41 వేల 712 సొమ్ము సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందాయి. అలాగే రూ.84 లక్షలతో 2 సచివాలయ భవనాలు, రూ.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనం, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు, రూ. కోటి 63 లక్షలతో 5 హెలెవిస్ వాటర్ ట్యాంక్ నిర్మాణాలు, రూ.5 లక్షలతో బస్ షెల్టర్, రూ.2 కోట్ల 23 లక్షలతో నాడు–నేడు పథకంలో పనులు, గడపగడపకు మన ప్రభుత్వ పథకంలో రూ.80 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. దొరమామిడి పంచాయతీ ఏర్పడిన 50 ఏళ్లలో ఈస్థాయి అభివృద్ధి ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దొరమామిడి రూపురేఖలు మారాయి



వైఎస్సార్ సీపీ పాలనలో దొరమామిడి రూపురేఖలు మారాయి. దొరమామిడి సచివాలయ పరిధిలో దొరమామిడి, తెల్లంవారి గూడెం సచివాలయాలు రెండూ ఉన్నాయి. వీటిలో 2019 నుంచి ఇప్పటివరకూ రూ. 25 కోట్ల 48 లక్షల 87 వేల 657 సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందజేయడం జరిగింది. అలాగే సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌లు, బస్ షెల్టర్, సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలు కూడా నిర్మించారు.

– ముప్పిడి బుజ్జమ్మ, కార్యదర్శి, దొరమామిడి, బుట్టాయగూడెం మండలం

సర్పంచ్‌గా గర్వపడుతున్నాను



నేను ఒక వ్యవసాయ కూలి కుటుంబానికి చెందిన వ్యక్తిని. వైఎస్సార్‌సీపీ తరుపున సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం వచ్చింది. ఎన్నికల సమయంలో ప్రజల ప్రశ్నలకు భయమేసింది. సీఎం జగనన్న సంక్షేమ పథకాల పేరిట ప్రజల బ్యాంక్ అకౌంట్లలో వేసిన డబ్బులతో వారు ఆర్థికంగా బలపడుతున్నారు. వారిని చూస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. జగనన్న పాలనలో పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

– తెల్లం రాముడు, సర్పంచ్, దొరమామిడి, బుట్టాయగూడెం మండలం

మోటార్‌బోరు ప్రారంభం



హైస్కూల్‌లో బోరు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గీతానారాయణ్, జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మోటార్‌బోరును ప్రారంభించారు. మాజీ సర్పంచ్ తల్లాడ సత్తిపండు కుమార్తె గీతా నారాయణ్ గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.2 లక్షలతో ఏర్పాటు వేసిన మోటారు బోరును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఈవో రామన్నదొర, హెచ్‌ఎం లోవ కుమారి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, కౌన్సిలర్ అయినాల రమణమూర్తి, పీపీఎస్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎస్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ రష్మీ రంజన్, కౌన్సిలర్ ఎం.సుబ్బరామయ్య, జయరాజ్ బ్యాంకింగ్ రంగంలో మార్పుల గురించి విద్యార్థులకు వివరించారు.

మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

టి.నరసాపురం: అభివృద్ధి అంటే అన్ని రంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమేనని, అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యం అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఏలూరు ఎంపీ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మితో కలిసి సోమవారం ఎంపీ ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకే తెచ్చి దేశంలోనే అత్యుత్తమ సీఎంగా జగన్ నిలిచారని అన్నారు. ఏలూరు ఎంపీగా సునీల్ యాదవ్‌ను, పోలవరం ఎమ్మెల్యేగా రాజ్యలక్ష్మిలను గెలిపించి జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు కల్పించినా అభివృద్ధిని అడ్డుకోవటానికి కోర్టులను ఆశ్రయించినా, వాటిని తట్టుకుని సంక్షేమం, అభివృద్ధిని చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనను గెలిపించడం వల్ల ఈ ప్రాంత వాణిని పార్లమెంట్‌లో వినిపించడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు. పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



కె.జగ్గవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ శ్రీధర్, కారుమూరి సునీల్‌కుమార్



గుడ్లపల్లిలో ఎరువుల గోడౌన్‌ను ప్రారంభిస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి

పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

తెడ్లం గ్రామంలో సచివాలయ భవనాన్ని, గుడ్లపల్లిలో సహకార సంఘం నిర్మించిన ఎరువుల గోడౌన్‌ను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అదేవిధంగా గోడౌన్ నిర్మాణానికి 50 సెంట్లు స్థలం ఇచ్చిన స్థలదాత రాజా రాఘవరాజు రంగరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే కె.జగ్గవరంలో సచివాలయ భవనాన్ని, బంధంచర్లలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. టి.నరసాపురంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. పుట్రేపులో విలేజ్ క్లీనిక్, తిరుమలదేవి పేటలో సహకార సంఘం నిర్మించిన ఎరువుల గోడౌన్‌ను ప్రారంభించారు. నాయకులకు ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు శ్రీను రాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, గుడ్లపల్లి గోడౌన్ స్థలదాత చినబాబు, గంజిమాల దేవి, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్ బాబు, మేడవరపు అశోక్, సర్పంచులు ఎం.స్రవంతి, బొంతు రమాదేవి అంజిబాబు, తడికలపూడి శివ మాధవి కిషోర్, మోదుగు సునంద, ఏఎంసీ డైరెక్టర్ నాగమణి, రైల్వే బోర్డు డైరెక్టర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు బండి సుబ్బారావు, జగ్గవరం రాంబాబు, నార్లపాటి వెంకట్రావు, అర్జా బాలయ్య, దేవరపల్లి ముత్తయ్య, పిన్నమనేని చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు నష్టపరిహారం అందజేత

పోలవరం రూరల్: ఉడతపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి దాడిలో పశువులను కోల్పోయిన ఉడతపల్లి గ్రామానికి చెందిన చుండ్రు వీరాయమ్మకు సోమవారం జిల్లా అటవీ శాఖాధికారులు రూ.30 వేల నష్టపరిహారం చెక్కును అందజేసినట్లు పోలవరం రేంజ్ అధికారి ఎస్.దావీదు రాజు తెలిపారు. ప్రస్తుతం పులి పాపికొండల అభయారణ్య ప్రాంతంలోకి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు.

యువకుడి అదృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఒక యువకుడి అదృశ్యంపై అతని తండ్రి యనమనేని రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం.. రాజు కుమారుడు అరవింద్ ఐటీఐ చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అరవింద్ రాత్రికి కూడా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

కామవరపుకోట: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తూరు బస్టాండ్ గ్రామస్తులకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే సీడీఫోర్ కౌంట్ తో సంబంధం లేకుండా ఏఆర్‌టీ మందులు వాడాలన్నారు. క్షయ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కళాకారులు వీధి నాటిక ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. రైట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కామవరపుకోట: పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రధానోపాధ్యాయులు రామసుందరికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాఠశాలలను అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్ది, ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టడంతోపాటు పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగ్‌లు, బూట్లు అందించి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, నానాది సాగర్, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, మేడంకి చిన్న, బండారు ప్రసాద్, అప్పారావు, బాబురావు పాల్గొన్నారు.



పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేస్తున్న విజయరాజు

వైఎస్సార్ సీపీని గెలిపించి రుణం తీర్చుకోవాలి

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఏర్పాటులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గణేష్ సెంటర్‌లోని కన్నాపురం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌ను రాజ్యలక్ష్మి ప్రారంభించారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసేవకు అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ రుణం తీర్చుకోవాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి ప్రజలు ఎన్నుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, వైస్ ఎంపీపీ మట్ట వనజలక్ష్మి, ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మలతో కలసి కార్యాలయ భవనాలలోని వివిధ విభాగాలను ప్రారంభించారు. సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము, గంటా శ్రీను, చిక్కాల దుర్గాప్రసాద్, అడపా సత్తిబాబు, కట్టా రాము, గోలిశెట్టి ప్రసాద్, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, కొనకల్ల రాము, ఘంటసాల మధు, మడుతూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో కాల్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా ప్రజాప్రతినిధులతో తెల్లం రాజలక్ష్మి

లెజెండ్స్‌ని స్మరించుకోవడం ఆనందదాయకం

టి.నరసాపురం: గ్రామాల్లో సుదీర్ఘకాలం పాటు లెజెండ్స్‌గా వ్యవహరించిన వ్యక్తులను నిత్యం స్మరించుకోవడం, వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు ఆధ్వర్యంలో కె.జగ్గవరంలో 40 ఏళ్ల పాటు సహకార వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన వెలిది కృష్ణమూర్తి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని సోమవారం ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘ అభివృద్ధికి వెలిది కృష్ణమూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ ఐదు గ్రామ పంచాయతీల ప్రజలకు వెలిది సుదీర్ఘ కాలం పాటు సేవలను అందించి ఈ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. ఈ సందర్భంగా వెలిది కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీవెంకటేశ్వరరావు, గంజిమాల దేవి, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, సర్పంచ్ టి.శివమాధవి కిషోర్, వంటిపల్లి వెంకటేశ్వరరావు, టి.వీరవెంకయ్య పాల్గొన్నారు.



వెలిది కృష్ణమూర్తి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కుట్టు శిక్షణతో మహిళలకు జీవనోపాధి

కామవరపుకోట: కుట్టు శిక్షణతో మహిళలు జీవనోపాధి పొంది ఆర్థిక అభివృద్ధి చెందడానికి వీలుపడుతుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఫాదర్ ప్రసాద్ అన్నారు. మండలంలో కొత్తూరు ఎమ్మెస్ ఎంఐ సిస్టర్స్ ప్రాంగణం నందు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 3 నెలల పాటు కుట్టు శిక్షణ పొందిన 26 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సేవా సంస్థ మాజీ డైరెక్టర్ అబ్రహం, జయలక్ష్మి, సిస్టర్ ఏంజెల్ రోసి, స్థానిక ఆర్‌సీఎం విచారణ గురువులు గోగు పీటర్ ప్రసాద్, టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చిన టోకూరి రాణి, దమయంతి, వరహాలమ్మ పాల్గొన్నారు.

అద్దె భవనం నుంచి సొంత భవనానికి..

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అద్దె భవనం నుంచి సొంత భవనానికి మార్చారు. సోమవారం ఆర్డీవో కె.అద్దయ్య, తహసీల్దార్ కె.స్లీవజోజి పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 ఏళ్లుగా తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. గతంలో జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడినప్పుడు ఆర్డీవో కార్యాలయ ఏర్పాటుకు అప్పట్లో తహసీల్దార్ కార్యాలయం కోసం నిర్మించిన భవనాన్ని కేటాయించారు. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలోనే సేవలు అందిస్తూ వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయానికి సొంత భవనం కోసం పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన అందించిన సహకారంతో ఆర్డీవో కార్యాలయం పూర్తయిందన్నారు. ఇటీవలే ఆర్డీవో కార్యాలయం నూతన భవనంలోకి మార్పు చేయగా, ఆ భవనాన్ని ఆధునీకరించి ఇక్కడ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీటీలు ఎం.రమేష్, వైవీ లక్ష్మీకుమారి, ఎం.వరలక్ష్మి ఆర్డీవో కార్యాలయ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ పూజలు నిర్వహిస్తున్న ఆర్డీవో అద్దయ్య, తహసీల్దార్ స్లీవజోజి

శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్ అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా లక్కవరంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రాజకీయ పార్టీలపై ఉన్న అభిమానంతో ఎదుటి పార్టీల వారిని దూషించే చర్యలకు ఎవరూ పాల్పడరాదన్నారు. గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. లక్కవరం ఎస్సై సుధీర్ పాల్గొన్నారు. వేగవరంలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ స్లీవజోజి, సీఐ రాజేష్, జంగారెడ్డిగూడెం ఎస్సై జ్యోతిబసు పాల్గొని ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.